C.P. Brown ACADEMY సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లీ ఉగాది కథలపోటీలో

విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ

వసంతోత్సవం ఇంకా మూడు రోజులుంది.

భరతప్ప వాసంతికతో గొడవ పడి నాలుగు రోజులయింది. చాలా మామూలుగా మొదలైన సంభాషణ... చినికి చినికి గాలివానైంది. వ్యాజ్యం న్యాయస్థానం దాకా వెళ్ళింది. విషయం చిత్రమైనదవడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. స్వయంగా రాయలవారే తీర్పు చెప్పబోతూండడం ఈ చిత్రమైన సంఘటనకి మరో విచిత్రమైన మలుపు.

రేపే తీర్పు.

★★★

# పాలు కలిసిన నీళ్ళు

డా. ఎల్.కె. సుధాకర్

''ప్రణయ వివాహమట కూడానూ!?''

''పైగా మగడూ, పెళ్లాం ఇద్దరూ పండితులట కూడానూ!''

''అస్సలు తంటా అక్కడే కదయ్యా వచ్చిందీ?!''

''ఏమిటో?''

''ఆ! ఏముంటుందీ? పంతాలూ, పట్టుదలలూనూ. ఎన్నయినా చెప్పు ఎవరూ ఎవరికీ లోబడక పోవడం కంటే దౌర్భాగ్యం ఏముంటుంది చెప్పు? కలికాలం కాకపోతే!''

''అంత సులువుగా చెప్పేయకు. ఆ భార్యాభర్తలు అన్యోన్య దంపతులే. ఒకరికొకరు లోబడి ఉండేవాళ్ళే. కాకపోతే ఈ ప్రత్యేక కారణం ఉంది చూశావూ! అది మహా గొప్పదీ! అంతకంటే చిత్రమైనదీనూ!''

''స్వయానా మూడు రాయల గండడు వ్యాజ్యం వినడమేమిటీ? తానే స్వయంగా తీర్పు చెప్తాననడమేమిటి? రాజ్యమంతా వసంతోత్సవ సంరంభాల మధ్య హడావుడిగా ఉన్న సమయంలో ఈ కలకలమేమిటో?''

''ఏమిటేమిటీ! రాయలవారే స్వయంగానా?''

''మరే!''

''అయితే రేపు కొలువుకి వెళ్ళవలసిందేస్మి!''

''పదండి మరి!''

మిత్రబృందం రాజాస్థానానికి వెళ్ళింది.

దార్లోనే కొంత సమాచారం సేకరించగిలిగేరు.

భరతప్ప మనసారా ప్రేమించి పెళ్ళాడిన వాసంతిక అందంలో అందం, పాండిత్యంలో పాండిత్యం కలబోసుకున్న నిండైన స్త్రీ. భరతప్ప మాత్రం తక్కువా! పాండిత్యంలో ఆమెకే మాత్రం తీసిపోడు. పైగా ప్రణయ జంట. సమయం స్వర్ణ ప్రవాహంలా సాగుతోంది. పెళ్ళయి ఏడాది కూడా కాలేదు. ఇంతలో ఇద్దరి మధ్యా చిన్న గొడవ. తానేమో అచ్చ తెలుగు పండితుడు. ఆమె కన్నడంలో దిట్ట. పుట్టబోయే బిడ్డని తెలుగు వాణ్ణి చెయ్యాలా లేక కన్నడిగుడిగా పెంచాలా? అన్న చిలిపి తగాదా ఇద్దరూ న్యాయస్థానాన్ని ఆశ్రయించేదాకా తీసుకొచ్చింది. ఏ విధంగా చూసినా తన తెలుగు భాషే గొప్పదంటాడు భరతప్ప. ససేమిరా అంటుంది వాసంతిక. వివాదం ముదిరి నీ భాష ఎంతంటే? నీ భాషెంత? అనే దాకా వచ్చి ఆపై నువ్వెంతంటే నువ్వెంత అనే దాకా వచ్చింది. ఇరు పక్షాల వాదోపవాదాలు రెండురోజుల పాటు వాడిగా చర్చించబడ్డాయి. ఆ మాట కొస్తే మొత్తం న్యాయస్థానం తెలుగుని సమర్థించేవాళ్ళుగా, కన్నడాన్ని సమర్థించేవాళ్ళుగా రెండుగా చీలిపోయిందని చెప్పాలి. తెలుగు భాష గొప్పదని ఒప్పుకోకపోతే విడాకులకైనా సిద్ధమంటాడు భరతప్ప. ఎవరి వాదనలు వింటున్నా సరైనవేనన్నట్టున్నాయ్.

కుర్రకారుకి హుషారు హెచ్చింది. పెద్దల్లో కొందరికి ఆందోళన పెరిగింది. ఇది ఎటు తిరిగి ఎక్కడ తేలుతుందోనన్న భయం పొడసూపింది. అప్పటి దాకా సుప్రసన్నంగా, సంతోషంగా, హాయిగా సాగుతున్న రాయలవారి రాజ్యపాలనలో చిన్న కుదుపు. కొందరు విజ్ఞులు తమాషా చూస్తున్నారు. ఏం జరగబోతోందన్న ఉత్సుకత అంతటా వ్యాపించింది. ఉన్నట్టుండి రాజ్యంలో భాషా సంబంధమైన సంవాదాలతో జనుల మధ్య బీటలు ఏర్పడుతున్నట్టు ఆస్థానానికి

వేగుల సందేశాలందాయి. ఉత్సుకత స్థానే ఉద్రిక్తత చోటుచేసుకోబోతోన్న కీలక సమయంలో...స్వయానా మహారాజులే తీర్పిస్తానడంతో...ఉత్సుకత తారాస్థాయిని చేరింది.

***

జయజయధ్వానాల మధ్య శ్రీశ్రీశ్రీ కృష్ణ దేవరాయలు సభకి వేంచేశారు. కవులూ, పురప్రముఖులూ, పెద్దలూ సగౌరవంగా లేచి అభివాదం చేశారు. తీర్పు కోసం ఎదురు చూస్తున్న భరతప్ప, వాసంతికలు మాత్రమే కాస్త ఆందోళనగా కనిపిస్తున్నారు. అయితే అప్పటిదాకా విపరీత మానసిక ఆందోళనలతో సతమతమౌతున్న వాళ్ళిద్దరిలోనూ రాయలవారి స్ఫూరద్రూపం చూడగానే ప్రశాంతత నెలకొంది. ఉత్సాహం చుట్టుముట్టింది.

అప్పటిదాకా లేని ఉత్తేజమేదో వారిని ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంది. భయం పోయింది. దిగులు మాయమైంది. ప్రసన్న గంభీరమైన వదనం వెన్నెల చంద్రుడిలా ఉంది. నవ్వు అప్పుడే విచ్చిన కలువపువ్వు. రాచరికపు దర్పంతో రాయలవారికి ధరించక తప్పలేదు గానీ..ఆయన ఆహార్యం చూస్తుంటే తెలుస్తోంది... చంద్రుడికెందుకు ఆభరణాలు అక్కర్లేదో?!

'సుభిక్షమైన ఈ రాజ్యంలో ఆజానుబాహులెందరు లేరు? అరవింద దళాయతాక్షులు రోజూ ఎందరు మనకెదురవరు? అందరిలో ఈ రాయలొకరు అంతే'' అనుకుందామనుకున్నాడు భరతప్ప అతడికి అరుచిగా అనిపించింది. నిజం కాదు కాబట్టి. నిజమేమిటీ అన్న ఆలోచనలో పడ్డాడు. ఇలాంటి సమయాల్లో తన హృదయమెరిగి కవిత్వ భావుకతని పరిపూర్ణం చేయగల శక్తి ఉన్నది వాసంతికకే. ఆమె వైపు చూశాడు. దాదాపు అదే మానసిక సంచలనాల మధ్య కొట్టుకుంటోన్న వాసంతిక కూడా అతడి వైపు చూడబోయి, అతడు చూస్తున్న సంగతి గుర్తు పట్టి మొహం తిప్పేసుకుంది. మనిషికి తేజస్సునిచ్చే అంశాలేమి? వాత్సల్యపూరితమైన మహారాజుల వారి సౌందర్యానికి కారణమేమిటి? అని ఆమె కూడా ఆలోచిస్తోంది.

విచిత్రమైన ఈ స్థితికి ఇద్దరూ మైమరిచిపోయారు. రాజుగారు ఆసీనులవడం కూడా వీళ్ళకి తెలియలేదు. పోతపోసిన స్వర్ణ ప్రతిమలా ఉన్నారు రాజుగారు. అది కాకుండా ఇంకేదో కూడా ఉంది ఏమిటది?!

సభా ప్రారంభాన్ని సూచిస్తూ నగారా మోగింది. నిశ్శబ్దం సభని ఆక్రమించుకుంది. ఆ సభా నిశ్శబ్దాన్ని మరింత గంభీరంగా మారుస్తూ వేయి కంచు గంటలొకేసారి మోగినట్టు ఖంగుమంటూ రాయలవారి కంఠం సభని పలకరించింది.

''విజయనగర సంప్రదాయం ప్రకారం సభ కవిత్వంతో మొదలవ్వాలి'' అంటూ మొదలుపెట్టి ''ఈ రోజు కవిత్వ పఠనం వంతు నాదే'' అన్నారు రాయలు. ''నా ఆముక్తమాల్యద కోసం రాయాలనుకుంటున్నది''

''అయితే చిన్న చిక్కొచ్చి పడింది. పద్యభావం హృదయంలో రూపు కట్టింది. కానీ పద్యంలో పెట్టడమే ఇంకా మిగిలింది. పద్యం పూర్తి కాకుండా భావాన్ని మాత్రం సభికులకి పంచడం సమయోచితం కాకపోవచ్చు గానీ ఎందుకో సభాసదులతో ఈ సందర్భంలో పంచుకోవాలని ఆశగా ఉంది.... ఉబలాటంగా ఉంది. అదీ సాహితీమూర్తులైన పెద్దలూ, కవివరేణ్యుల అనుమతితోనే'' గుప్పెడంత మీసాల మాటునుండి గుంభనంగా నవ్వుతున్నట్టున్న వదనంతో సభనుద్దేశించి పలికారు రాయలవారు.

''రాయల సభలో కవిత్వం ప్రత్యేకంగా పద్యంగా అల్లబడుతుందా? ఏమిటి? పలికే ప్రతి పదమూ కవిత్వమే....అదీ ప్రభువుల వారి నోటి వెంట....మహా ప్రసాదం'' అన్నాడు తెనాలి రామకృష్ణ కవి.

రాయలవారు వివరించడం మొదలు పెట్టారు.

సభికులు ఉత్సాహంగా వింటున్నారు.

భరతప్ప, వాసంతిక ఒళ్ళంతా చెవులు చేసుకున్నారు.

అష్టదిగ్గజాలు హాయిగా ఆలకిస్తున్నారు. అపురూపంగా ప్రేమగా అప్పాజీ అవలోకిస్తున్నారు.

''అది శిశిరం. అంతటా ఆకు రాలు కాలం. విశాలమైన ఆకుపచ్చ మైదానంలో గోవుల మందలు



హాయిగా పచ్చిక మేస్తున్నాయ్. మైదానం క్రిందుగా పల్లపు ప్రదేశంలో ఒక సెలయేరుంది. స్వచ్ఛమైన ఆ నీటి ప్రవాహంలో రాజహంసలు విహరిస్తున్నాయ్. దూరంగా పచ్చిక మేస్తోన్న గోవుల క్రీగంటి చూపుల్లోంచి ఈ హంసలు దూడలల్లే కనిపించాయి. ఒకసారిగా మాతృవాత్సల్యంతో గోవుల పొదుగులు పాలు చేపుకొచ్చాయి. అలా పొదుగుల నుండి ధారలు కడుతోన్న పాలు సెలయేటిలో కలిసిపోయాయి.

పాలలో నీళ్ళు కలవచ్చు గానీ, నీళ్ళలో పాలు కలవకూడదు...విషంతో సమానం అని తెలిసిన రాజహంసలు తమ క్షీరనీర న్యాయవివేచనతో ఆ సెలయేటిలో పాలనీ నీళ్ళనీ వేరుచేసుకుంటూ సాగిపోతున్నాయ్'' అంటూ ఆగేరు.

''వహ్వా!'' సభికులంతా ఆస్వాదించడం తెలిసిన మనసులతో వినమ్రంగా రాయలవారికి నమస్కరించారు. అందరి వదనాల నిండా వర్ణించి చెప్పలేని నిర్మలమైన ఆనందం. అష్టదిగ్గజాల మస్తిష్కాలలో ఆ అరుదైన దృశ్యం రూపు కట్టుకుంది.

భరతప్ప, వాసంతిక తమని తాము మరిచిపోయి చాలా సేపయింది. తామెందుకొచ్చామో వాళ్ళకి గుర్తే లేదేమోనన్నంతగా మైమరిచిపోయారు. వాసంతిక భరతప్ప వైపు చూసింది. ఆమె పెదాల చివర పూసిన నవ్వు పువ్వు రేకులు రేకులుగా విచ్చుకుంటుండంగా

భరతప్ప తన సహచరి చర్యకు ప్రతి చర్యగా చిరునవ్వేడు. ఆ మహాసభలో వారిరువురి మధ్యా నవ్వు చర్విత చర్వణమైంది.

అప్పటి దాకా కవిత్వ పారవశ్యంతో మృదుల మనోహరంగా పలికిన రాయలవారి కంఠస్వరం ఇప్పుడు కఠిన గాంభీర్యాన్ని సంతరించుకుంది. ''ఆc! ఇక వివాదాల జంట గురించిన విషయం చూద్దాం!'' అన్నారు రాయలవారు దర్పంగా. సభ సైతం నిండు గాంభీర్యాన్ని ఆభరణంగా ధరించుకుంది.

రెండడుగులు ముందుకేసారు భరతప్ప వాసంతిక కలిసి. ఇరువురి మాటలూ తనే చెప్పసాగేడు భరతప్ప...''మహా ప్రభువులు మన్నించాలి! సరస్వతీ కటాక్ష వీక్షణాలు ఈ సభని సతతం సంచరించడం లోకవిదితమే! ఇప్పుడు మాకిద్దరికీ ప్రత్యక్షానుభవం. ధన్యులం. యాదృచ్ఛికంగా తమ నోటి వెంట వచ్చిన భావుక కవిత్వ పంక్తులు మా మనసుల్ని తేటపర్చాయి. ఇందుపకాయ అరగదీసిన కాల్వ నీళ్ళకు మల్లే పరిశుద్ధమయ్యాయి. ఆ క్షణమే మా మధ్య పొరపొచ్చాలు మాయమైపోయాయి. మా మధ్య ఇక వివాదాలకు తావేలేదు. మేమిద్దరం జీవిత పర్యంతం సహచరులమే. విలువైన ప్రభుత్వ సమయాన్ని వృధా చేసినట్లయితే మనసారా తమ పితృ వాత్సల్యంతో క్షమించ మనవి'' అంటూ ఒక్కటిగా మారిన రెండు భాషల ప్రవీణులు మూడు రాయల గండడి ముందు వినమ్రంగా మోకరిల్లారు.

''భరతప్పా! మనుగడలో భాష ముఖ్యమైంది. భాషకంటే భావం ఇంకా ముఖ్యమైంది. భాష కంటే భావం కంటే.... జీవితం అత్యంత ముఖ్యమైంది. మర్చిపోకు'' అన్నారు రాయలవారు.

అంతా ఆశీర్వదిస్తుండగా సభ నుంచి ప్రపంచంలోకీ జీవితంలోకి ప్రయాణం మొదలుపెట్టారు.

చిన్ని కవిత్వం ఇంత సామరస్యాన్ని సాధించడంలోని సంతృప్తితో రాయలు ఎప్పటిలానే చిరునవ్వేరు. అయినా వారి వదనంలో ఏదో వ్యాకులత...ఇబ్బంది. అది కనిపెట్టగలిగినవాడు తండ్రిలాంటి అప్పాజీ ఒక్కడే కదా! కనిపెట్టాడు. అర్థంతరంగా వాయిదా వేయించాడు.

ఆ సాయంత్రం...

రాయలవారి ఆంతరంగిక కార్యాలయంలో సభ ఏర్పాటు చేయబడింది. కేవలం అష్టదిగ్గజాలూ, అప్పాజీ మాత్రమే ఆహ్వానించబడ్డారు. అంతా సమావేశమయ్యారు. అప్పాజీ, రాయలవారూ ఇంకా రావాల్సి ఉంది. వాతావరణం భారంగా ఉంది. తేలిక పర్చే బాధ్యత ఎప్పటిలానే తెనాలి కృష్ణుడు భుజాన వేసుకొన్నాడు. కవి మిత్రుల కబుర్లలో కవిత్వం అలా అలా అలవోకగా జాలువారుతోంది. తెనాలి కృష్ణుడు తన సహచరుల ముందు అప్పటికప్పుడు ఒక సమస్య పద్యపాదాన్ని చ్చాడు.

'టంటటటటటం టటంట టంటం టంటా!' అని. తెనాలి వారి చమత్కారపు రుచి మరిగిన సహకవులంతా ఎట్నుంచి ఎటు తిప్పుతాడా అని ఎదురు చూడసాగారు. అందరి చేతా కాసేపు బ్రతిమాలించుకుని, రాజుగారు రావడానికింకా సమయం ఉందని నిర్ధారించుకుని బెట్టు చేసి అప్పుడు ఆ పద్యాన్ని తనే పూరించాడు తెనాలి రామకృష్ణుడు. అల్లరల్లరిగా ఆయన పూరించిన అందమైన కందపద్య భావం ఇదీ....

''ఒక మహారాజుగారు స్నానపు గదిలో స్నానానికి ఉపక్రమించారు. సమయానికి గదిలో చెంబు లేదన్న విషయం తెలిసింది. సరిగ్గా అదే సమయానికి రాణీవాసపు చెలికత్తె ఒకామె రాగిచెంబుతో మెట్లు దిగుతోంది. పై మెట్టు నుంచి చూస్తే స్నానపు గదిలోని రాజుగారు కనిపించారు. ఆజానుబాహులైన రాజుగారి అద్భుత శరీర లావణ్యానికి చెలికత్తె మనసు వశం తప్పింది. చేతనున్న చెంబు జారిపడింది. ఆ చెంబు మెట్లు మీదుగా జారిపోతూ చేసిన శబ్దమే ఆ పద్యపు నాలుగో పాదం'' అంటూ ముగించాడు.

''ఆ మహారాజెవరో కాదు! మన ప్రభువు శ్రీకృష్ణ దేవరాయలే!'' అంటూ ముక్తాయించాడు.

చెంబు శబ్దాన్ని సైతం కవిత్వం చెయ్యగల దిట్ట మన తెనాలి క్రిష్ణ అంటూ పొగిడారు అల్లసాని వారు.

''అంతా రాయలవారి సౌందర్య మహిమ... రాగి చెంబు సైతం రాగాలమయమై మెట్ల మీంచి దొర్లు కుంటూ వస్తుంది'' అన్నాడు రామక్రిష్ణ.

సభకి రాయలవారొస్తున్నట్లు కబురందింది.

''ఏదో రసవత్తర చర్చ జరుగుతున్నట్లుంది'' అన్నారు మహరాజు రావడంతోనే.

''ఎలాంటి సందర్భాన్నయినా కవిత్వంలో ఇముడ్చుకోగల తెలుగు భాష గురించే ప్రభూ! తెలుగులోని సౌందర్యం గురించే.''

తెలుగు అన్న మాట వినబడగానే రాయలవారి ముఖారవిందంలో తళుక్కుమంటో వెలుగురేఖ. వెంటనే ఒక ప్రశ్న.

''అసలు, భాష దేని కోసం?'' అనడిగేరు

''అభివ్యక్తి(కమ్యూనికేషన్) కోసం ప్రభూ!''

''ఒకే భాష తెలిసిన ఇద్దరు వ్యక్తులు సంభాషించుకుంటున్నప్పుడు అభివ్యక్తీకరణలో మరో భాషని వాడవలసిన అవసరమెప్పుడొస్తుంది?! అసలు అలా పరాయి భాషని వాడడంలోని ఔచిత్యం ఏమిటి?'' తనలో తానే ప్రశ్నించుకుంటున్నట్టు సభనుద్దేశించీ. మళ్ళీ ఆయనే



సమాధానం చెప్పుకుంటున్నట్టు ''అక్కర్లేదు. అయినా పరభాష మాట్లాడాల్సిన అవసరం ఎందుకొస్తుంది? భరతప్ప కోసం వాసంతిక తెలుగు భాష నేర్చుకుంది.

భార్య కోసం భరతప్ప కన్నడం నేర్చుకున్నాడు–

ఇంత అన్యోన్యత మధ్య ఈ వ్యత్యాసాలెందుకు వస్తున్నాయ్?

అసలు భాషా సంకరం జరగాల్సిన ఆగత్యం ఎందుకేర్పడుతోంది. అన్నీ ప్రశ్నలే నేటి ఉదయం నుండీ మస్తిష్కాన్ని కలచివేస్తూ,'' చివరికి ఓ కొలిక్కి వస్తున్నట్టు ''నాకు తెల్సినంత వరకూ ఏ మనిషికైనా పరాయిభాష మాట్లాడాల్సిన అవసరం కేవలం దర్పం కోసమే'' అంటూ కవుల వైపు చూశారు. అవునన్నట్టు అంతా తలలూపారు.

''అది ఒక్కొక్కసారి అనివార్యం కూడా కావొచ్చు మహరాజా!'' అన్నారు అప్పాజీ.

''నిజమే! అది కూడా నేను అంగీకరిస్తాను. కానీ ఈ అనివార్యత ఇక్కడితో ఆగదు అప్పాజీ! ఒక భాషలోనికి మరో భాష పరకాయ ప్రవేశం చేయడం కేవలం ప్రారంభం మాత్రమే. ఈ ఆధిపత్య పోరాటం చాప కింద నీరులా పాకిపోతుంది. ఆపై అసలు భాష, తర్వాత సంస్కృతి, సంప్రదాయాలు, వేషధారణ, వస్త్రధారణ జీవన విధానం మొత్తం కకావికలైపోతాయ్. పరాయి వ్యామోహం సమూహాల్ని తనవైపు తిప్పుకోవడం కోసం వ్యాపారపు వల పన్నుతుంది. ఏమో! ఒక్కోసారి మొత్తం సంస్కృతే మాయమైపోవచ్చు కూడా!'' కాస్త ఆవేశంగా అన్నారు రాయలవారు మళ్ళీ దీర్ఘాలోచనలో పడ్డారు. రెండు క్షణాలు కలవర పడినట్టు కనిపించారు. కొనసాగించారు.

''ఈ ధోరణి...చివరికి మనుషుల్ని రాజ్యాల్ని, సంస్థానాల్నీ విచ్చలవిడిగా విడగొట్టేయవచ్చు. దాని వల్ల జరగబోయే నష్టం తలుచుకుంటే కలతగా ఉంది. మనసంతా చేదుగా ఉంది. ఏమో! ఇంకో అయిదొందల ఏళ్ళ తర్వాత కూడా మనుష్యులు ఈ విపత్తుని పరిష్కరించుకోలేకపోవచ్చు. ఈ ఆలోచనే నా హృదయాన్ని వ్యాకుల పరుస్తోంది. మనుష్యులు విడిపోవడం గురించిన ఆందోళన గుండెల్ని మెలిపెడుతోంది.''

మహారాజుగారి మాటలతో వాతావరణం బరువెక్కింది. దాన్ని తేలిక పర్చగలవాడు తెనాలి రాముడొక్కడే అక్కడ. ఆ దిశగానే...''ఏదైనా ఉదయం జరిగిన సంఘటన వల్ల ఓ మహోపకారం జరగబోతోంది ప్రభూ!''

ఏమిటన్నట్టు మహారాజుతో సహా అంతా ఆశ్చర్యంగా చూశారు.

''ఆ భరతప్ప ఇంట్లో పిల్లలు ద్విభాషా పండితులవుతారు. ఖచ్చితంగా రాయలవారి పాలన మరి. పండిత పుత్రః పరమ పండితః అంతే'' అన్నాడు.

***

రాజ్యమంతటా భరతప్ప వాసంతికల విషయం సర్వత్రా చర్చనీయమైంది. అన్యోన్యమైన ఒక జంట... వాదులాడుకోవడం... విషయం ముదిరి విడాకుల దాకా వెళ్ళడం... ఆపై రాయల వారు చాలా సులభంగా నాలుగు కవిత్వ వాక్యాలతో మొత్తం వివాదానికి తెరదించడం. ఇంత సరళం అంత జటిలమైన సమస్యని సాధించిన తీరు ఎక్కడ చూసినా ఇదే చర్చ. మారు వేషాలలో ఒక సత్రంలో బసచేశారు రాయలూ, అప్పాజీ, తెనాలి రామక్రిష్ణ కవీంద్రుడూ.

నిన్న కొలువుకెళ్ళిన మిత్రబృందం సత్రం అరుగు మీద జేరారు.

''ఎంత గొప్ప పరిష్కారం. అద్భుతం అనుకో!''

''ఇంతకీ ఆయన చెప్పిన ఆ యాదృచ్ఛిక కవిత్వానికి అర్థమేమిటో?''

''చెప్తా విను...ఎల్లలెరుగని విశాలమైన ఆకుపచ్చ మైదానం రాయలవారి సామ్రాజ్యం. పాలు కన్నడ భాషకి ప్రతీక. నీళ్ళు తెలుగు భాష. స్వచ్ఛమైన మహాప్రవాహంలో పాలు కలవడమంటే అది భాషా సంకరం. అది అనివార్యమైన చోట పాలనీ నీళ్ళనీ వేరు చేయగల హంసలాంటి హృదయంతో ఉండగలిగితే మనుగడ ఎంతో ఆహ్లాదంగా సాగుతుందని కవి హృదయం.''

''అయితే ఆ కవిత్వ పఠనం యాదృచ్ఛికం కాదన్న మాట.... కావాలనే ప్రభువులు?!!!''

''అంటే రాయలవారు కన్నడ భాషని పాలతో పోల్చారు గనుక కన్నడ భాషని సమర్థిస్తున్నారన్న మాట''

''ఏమిటేమిటి? నీకలా అర్థమైందా?! పాలు ప్రశస్తమైనవి సరే. కానీ నీళ్ళు...జీవం కదా. ఈ విషయాన్ని మర్చిపోకూడదు నువ్వు. అలాగని రాయలవారు తెలుగునే ఆకాశానికెత్తారనుకోనక్కర్లేదు. కాబట్టే కన్నడాన్ని తక్కువ చేయలేదు. ఆయన మనోవేదనంతా పాల గురించీ, నీళ్ళ గురించీ కాదు. హంసల గురించి. ఆ సమన్వయం మనం సాధించగలమో లేదోనన్న ఆందోళన. ఇదే విషయం అటు త్రిప్పి కన్నడ గురించి ఆలోచించు....అందులోని లోతు అప్పుడు తెలుస్తుంది.''

ఈ విశ్లేషణకి సత్రం చుట్టూ చేరిన శ్రోతలు అచ్చెరువొందుతున్నారు. ఆ జనంలో ఒకరుగా కలిసిపోయిన రాయల బృందంతో సహా.

''అయితే ఒక విషయం...బహుభాషా కోవిదులైన శ్రీక్రిష్ణ దేవరాయల వారు తరచి తరచి చూసి తేల్చిన సంగతి మాత్రం ఏమంటే తెలుగే అన్నిటికన్నా గొప్ప భాష అని'' కొత్త విషయాన్ని తెలియజేస్తున్నట్టు చెప్పాడో యువకుడు.

''ఆc! మరే! తెలుగు భాష గురించి గొప్ప పద్యం కూడా చెప్పాడు మహారాజు. గుర్తు రావట్లేదు కానీ...'' అంటూ గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నించాడు మరొక యువకుడు.

''నేను చెప్తాను'' అంటూ లేచి నిలబడి ఓ పదిహేనేళ్ళ కుర్రాడు రాగయుక్తంగా ఆ పద్యాన్ని పాడడం మొదలుపెట్టాడు.

''తెలుగదేల యన్న దేశంబు తెలుగేను
దెలుగు వల్లభుండఁదెలుగొకండ
యెల్లనృపులుగొలువ నెఱుగవే బాసాడి.
దేశభాషలందు తెలుగు లెస్స.''

రాయలవారి హృదయం పులకరించింది. తెనాలి కృష్ణుని మది కలవరించింది. అప్పాజీకి ఆహ్లాదంగా అనిపించింది. ఒక మహాసంగ్రామాన్ని గెలిచినప్పటి ఆనందం కంటే ఎక్కువ సంతోషాన్ని గర్వాన్ని రాయలవారి వదనం ప్రతిఫలించింది.

ఆ సంతోష సందర్భంలో అక్కడ సభ్యులందరికీ– అజరామరమైన ఆ పద్యాన్ని రచించిన రాయలవారు మీ మధ్యే ఉన్నాడని చెప్పేద్దామా అనుకొన్నాడు రామక్రిష్ణ కవి. ''మనం ఉన్నామా? లేదా? అన్నది కాదు విషయం. మన కవిత్వం ప్రజల నాల్కల మీద, మనస్సుల్లోనూ చిరకాలం వెలుగుతోందా లేదా అన్నదే ముఖ్యం. తద్వారా సంస్కృతిని సంప్రదాయాల్ని, అనుబంధాల్ని తరం నుంచి తరం మోసుకుపోగల గాలి. అదీ పరమార్థం.'' అని చెప్పే రాయలవారి మాటలు గుర్తొచ్చి తన ఆలోచన విరమించుకొన్నాడు.

***

దూరంగా....

మరో ఊరిలో మళ్ళీ ఒక్కటైన వాసంతిక, భరతప్పలు కూడా ఈ విషయాన్నే చర్చించుకుంటున్నారు.

''రాయలవారిది నిజంగా బంగారు విగ్రహమే. అంతకు మించిన ఆకర్షణ ఏమిటో తెలీడం లేదు'' అంటున్నాడు భరతప్ప.

''ఆ బంగారు విగ్రహానికి అబ్బిన కవిత్వ పరిమళం'' అంటో శృతి కలిపింది వాసంతిక.

''ఇద్దరం కలిసి చర్చించుకున్నాక గానీ రహస్యం వీడలేదు... చిత్రం కదూ!'' అన్నాడు భరతప్ప

''మనరాజ్యంలో ఇప్పుడు రెండు చందమామలు. నింగిలో ఒకటి... రాయలవారి వదనంలో ఒకటి'' అంది వాసంతిక.

''కాదు కాదు మూడు...ఒకటి నింగిలో, ఒకటి రాజాస్థానంలో.. మరొకటి నా గుండెల్లో'' అంటూ ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు భరతప్ప.

చంద్రుడునవ్వేడు.

విజయనగర సామ్రాజ్యంలో వసంతోత్సవానికి వేళవుతోంది.

✻

రచయిత సెల్ నెం: 98493 79841

